ఉప్పల్, జూన్ 19 : రోడ్డుపై చెత్త వేసే వారిని గుర్తించి.. హెచ్చరించి.. పట్టించే విధంగా నూతన సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ అధికారులు. చిలుకానగర్ డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీ పార్క్ వద్ద గార్బేజ్ వనరబుల్ పాయింట్ ఎలిమినేషన్‌లో భాగంగా ఎవరైనా చెత్తవేస్తే గుర్తించేందుకు, ఏర్పాటు చేసిన సీసీ కెమెరా.. విత్ మైక్ సిస్టంను ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు బుధవారం ప్రారంభించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి వెయ్యి రూపాయాల జరిమానా విధిస్తామన్నారు.

నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 20 జూన్ 2024 | HYDERABAD

ఉత్తమ సేవలకు రివార్డులు

సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల్లో వివిధ విభాగాల్లో ఉత్తమ బాధ్యతలు నిర్వర్తించిన సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి రివార్డులు అందించారు. ఎలక్షన్ సెల్, పోస్టల్ బ్యాలెట్ వింగ్, సిటీ ఆర్మ్డ్ రిజర్వు, ఐటీ అండ్ కమ్యూనికేషన్, ఆర్మ్స్ సెక్షన్, మెయిన్ కంట్రోల్ రూం, ఐటీ సెల్, ఐసీసీసీ బిల్డింగ్ స్టాఫ్, శాంతి భద్రతల విభాగం సిబ్బంది రివార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో అందరూ కలిసికట్టుగా పనిచేశారని సీపీ వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, సత్యనారాయణ, జాయింట్ సీపీలు పాల్గొన్నారు.

సింథటిక్ రంగులు.. కుళ్లిన కూరగాయలు

హాస్టళ్లలో 'ఫుడ్ సేఫ్టీ' తనిఖీలు

సిటీబ్యూరో/ మాదాపూర్: ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. తాజాగా పలు హాస్టళ్లపై దాడులు చేపట్టారు. సింధూ జడ్డు ఉమెన్స్ హాస్టల్‌లో డస్ట్‌బిన్‌లకు మూతలు లేకుండా ఉండటాన్ని గుర్తించారు. గడువు ముగిసిన మిరప పొడిని సీజ్ చేశారు. ఓం శ్రీ సాయి నంద డీలక్స్ మెన్స్ హాస్టల్స్ లో వండేటప్పుడు.. వడ్డిస్తున్నప్పుడు గుట్కా నమిలే కార్మికులు, సింథటిక్ రంగుల వాడకం, కుళ్లిన కూరగాయలు, బొద్దింకలు, తుప్పు పట్టిన దోస పెనం, అపరిశుభ్ర వాతావరణంలో వంట గది, సోయాసాస్ గడువు ముగియడం, తనుశ్రీ గ్రాండ్ ఉమెన్స్ హాస్టల్స్‌లో బొద్దింకలు, ఓపెన్ డస్ట్‌బిన్‌లతో అపరిశుభ్రమైన వంటగది, టోమాటో సాస్, చిల్లీ సాస్ నమూనాలు స్పాట్ టెస్టులో విఫలమయ్యాయి. ఓం శ్రీ సాయి నంద ఉమెన్స్ హాస్టల్స్‌లో మూతలు లేకుండా డస్ట్‌బిన్‌లను తెరిచి ఉంచినట్లు గుర్తించారు. ఎస్ఆర్ లేడీస్ హాస్టల్స్‌లో పని ప్రదేశం, రిఫ్రిజిరేటర్ అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. బియ్యం, కారం, పసుపు పొడి నమూనాలను సేకరించారు. సంబంధిత హాస్టళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

బాల్యంపై మోయలేని భారం

సిటీబ్యూరో: అవసరం ఉన్నా..లేకున్నా.. పుస్తకాలు కొనిపించి.. పిల్లలపై మోయలేని భారాన్ని వేస్తున్నాయి పాఠశాలల యాజమాన్యాలు. కేవలం తరగతికి సంబంధించిన పుస్తకాలే కాకుండా అదనంగా కొనుగోలు చేయిస్తూ తల్లిదండ్రుల నుంచి డబ్బులు గుంజుతున్నాయి. దీంతో వయసుకు మించి బరువున్న బ్యాగులను మోస్తూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. విద్యాశాఖ స్కూల్ బ్యాగుల బరువుపై గతంలో ఎంత ఉండాలో తరగతి లెక్కన ఆదేశాలు జారీ చేసింది. కానీ ఆ నిబంధనలను పాఠశాలలు గాలికొదిలేశాయి. అధిక బరువు బ్యాగులు మోయడం వల్ల విద్యార్థులు వంగి నడవడం, ఎముకలు అరగడం తదితర సమస్యలతో బాధపడుతున్నట్టు విద్యాశాఖ అధికారులకు తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. 7 నుంచి 17 కిలోల వరకు స్కూల్ బ్యాగుల బరువు ఉంటున్నదని విద్యార్థులు, తల్లిదండ్రులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠ్యపుస్తకాల సీజ్

సైదాబాద్: సైదాబాద్ జయనగర్‌లోని సెయింట్ అండ్రూస్ పాఠశాల ఆవరణలో బుధవారం పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న గదిని సైదాబాద్ జోన్ విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను విక్రయిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సైదాబాద్ జోన్ ఉప విద్యాశాఖ అధికారి తిరునగరి రాధాకృష్ణ ఆదేశాల మేరకు అధికారులు పాఠశాలలో తనిఖీ చేసి.. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ఉన్న గది సీజ్ చేశారు.

మళ్లీ కరెంటు కష్టాలు

సమైక్య పాలనలో కరెంటు ఎప్పుడు వచ్చేదో..ఎప్పుడు పోయేదో తెలియకపోయేది.. పరిశ్రమలకు పవర్ హాలీడేలూ ఉండేవి. ఆ చీకటి రోజుల నుంచి.. స్వరాష్ట్ర సాధన తర్వాత తెలంగాణ వెలుగు దివ్వెగా మారింది. పదేండ్లలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతోపాటు గృహావసరాలకు కూడా 24 గంటలూ.. నాణ్యమైన కరెంట్ అందించింది కేసీఆర్ సర్కారు. అయితే, ఇప్పుడు కాంగ్రెస్ పాలన వచ్చిన ఆరేడు నెలల్లోనే విద్యుత్ రంగం గాడి తప్పింది. ఉమ్మడి పాలనలోని కరెంట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ముఖ్యంగా పవర్ కట్‌లతో పారిశ్రామిక రంగం కుదేలవుతున్నది. పారిశ్రామికవేత్తలు, చిరువ్యాపారులు, కుటీర పరిశ్రమలు యంత్రాలను నడిపించి జీవనోపాధి పొందే వారు తీవ్రంగా నష్టపోతున్నారు. - సిటీబ్యూరో/నెట్‌వర్క్

కాంగ్రెస్ పాలన అంటేనే కరెంటు కోతలు

కాంగ్రెస్ పరిపాలన అంటేనే కరెంటు కోతలు. ఇది నా చిన్న తనం నుంచి చూస్తున్నా. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కరెంటు కోతలు లేవు. కానీ మళ్లీ పాత రోజులు గుర్తుకు తెచ్చేలా.. కోతలు ప్రారంభమయ్యాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి. కరెంటు ఉంటేనే యంత్రాలు నడుస్తున్నాయి. లేదంటే తిరిగి సమస్యలు గతంలాగానే ఉంటాయి.

-సత్తయ్య, గార్మెంట్స్ వ్యాపారి, బేగంపేట

మహోన్నతమైన వ్యక్తి కేసీఆర్

మహోన్నతమైన వ్యక్తి కేసీఆర్. పరిశ్రమలు, చిరు వ్యాపారాలు బాగుపడుతాయని భావించి.. నిరంతరాయంగా కరెంటు సరఫరా అందించారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా అందరికీ విద్యుత్‌ను అందించారు. కేసీఆర్ ప్రభుత్వం లేకపోవడంతో పదేండ్ల ముందు ఎట్ల ఉండేనో.. ఇప్పుడు కూడా అట్లనే ఉన్నది.

- రేణుక, గృహిణి రాంగోపాల్‌పేట

ముందు చూపు లేకనే..

ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం, అధికారులతో సమన్వయ లోపం కారణంగానే పదేండ్ల తరువాత మళ్లీ కరెంటు కోతలు చూడాల్సి వస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం మండు వేసవిలోనూ విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తే కాంగ్రెస్ సర్కారు రాగానే పరిస్థితి మారిపోయింది.

-మామిడి శ్రీనివాస్, టైలర్, విద్యానగర్

పట్టించుకునే వారే కరువు..

కరెంటు సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే పట్టించుకునే వారే కరువయ్యారు. చిన్న పాటి వర్షం పడినా.. కరెంటు తీసేస్తున్నారు. కరెంటు పోతే ఫిర్యాదు చేస్తే..గంటల తరబడి సమస్యను పరిష్కరించడం లేదు. పదేండ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయి. వ్యాపారాలు, హోటళ్ల నిర్వహణ కష్టంగా మారే అవకాశమున్నది.

-గోపాల్, హోటల్ వ్యాపారి, రాంనగర్

ఉపాధి కోల్పోతున్నాం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఒక్క నిమిషం కూడా కరెంటు పోలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు మొదలయ్యాయి. వేళాపాళా లేకుండా ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్‌గా జీవనోపాధి పొందుతున్న మాలాంటి వారికి ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం నిరంతరం కరెంటు సరఫరా చేయాలి. **-విజయ్, డీటీపీ ఆపరేటర్, విద్యానగర్**

'అగ్నిప్రమాదాలు నివారిద్దాం'

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : అగ్నిప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేసే దిశగా ప్రత్యేక క్యాంపెయిన్‌కు జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగం శ్రీకారం చుట్టింది. విద్యాసంస్థలు, దవాఖానలు, వాణిజ్య సంస్థ నిర్వాహకులతో కలిసి 'అగ్ని ప్రమాదాల ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. వాణిజ్య సముదాయాల్లో ఫైర్ ఎన్ఓసీ, ఫైర్ సేఫ్టీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అగ్ని ప్రమాదాలు, నివారణపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించేందుకు నడుం బిగించారు. ఈ మేరకు చక్కగా అర్థమయ్యే విధంగా ఆధునిక వర్చువల్ రియాల్టీ సిస్టంను వినియోగించాలని నిర్ణయించి.. ఈ మేరకు యంత్రం కొనుగోలుకు సిద్ధమయ్యారు. రూ. 3 లక్షల వ్యయంతో ఈ యంత్రాన్ని కొనుగోలు చేసి అవగాహన కల్పించనున్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలిగినప్పుడే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని, అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ఎన్. ప్రకాశ్‌రెడ్డి సూచించారు.

బకాయి చెల్లించకుంటే..

నల్లా కనెక్షన్ కట్



సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : రెవెన్యూపై నిర్దేశించిన లక్ష్యాలను ఈ నెలాఖరులోపు చేరుకోవాలని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో రెవెన్యూపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించి.. డివిజన్ల పరంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత లక్ష్యాలను ఈ నెలాఖరులోపు చేరుకోవాలని, ముఖ్యంగా మొండి బకాయిలు, కమర్షియల్ వినియోగదారుల బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న పెండింగ్ బిల్లులపై ఎండీ ఆరా తీశారు. బిల్లులు చెల్లించని వారికి.. బిల్లులు కట్టేలా సందేశాలు పంపించాలన్నారు. బకాయిదారులు స్పందించని పక్షంలో మరోసారి హెచ్చరిక సందేశం పంపాలన్నారు. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. నల్లా కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్, అజ్మీరా కృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.